

ఇట్లయితే.. సదువులెట్ల?

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

వివరాలు 8లో ►



పశువుల షెడ్లతో మేలు

రైతుల కోసం పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్కో షెడ్డుకు రూ. 54 వేలు మంజూరు చేస్తోంది.

వివరాలు 9లో ►

ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించిన మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తామని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, పార్శీలు ఈనెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 040- 23236112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

మెదక్ ఎస్పీగా ఉదయ్‌కుమార్ రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: జిల్లా ఎస్పీ బాలస్వామి బదిలీ అయ్యారు. నూతన ఎస్పీగా ఉదయ్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు నెలల క్రితమే బాలస్వామి ఎస్పీగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈక్రమంలో ఆయన హైదరాబాద్ ఈస్ట్‌జోన్ డీసీపీగా బదిలీపై వెళ్లారు. అయన స్థానంలో సౌత్‌జోన్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు.

భూమికి భూమి ఇవ్వాల్సిందే..



ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు

నర్సాపూర్ రూరల్: కొండపోచమ్మ– సంగారెడ్డి రీచ్– 2 కాల్వ సర్వే పనుల్లో భాగంగా చెట్ల సంఖ్యను తెలుసుకునేందుకు వచ్చిన ఇరిగేషన్, అటవీశాఖ అధికారులను బుధవారం మండలంలోని చిన్నచింతకుంటలో భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. అనంతరం ధర్నా నిర్వహించారు. దీంతో అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి ఏఎస్ఐ వెంకటేష్ సిబ్బందితో చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు ధర్నా విరమించేందుకు ససేమిరా అన్నారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భూమికి భూమి లేదా రూ.60 లక్షల నష్టపరిహారం ఇస్తేనే సర్వే చేసేందుకు అనుమతి ఇస్తామని తేల్చి చెప్పారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



దీక్షలో బీజేపీ నాయకులు

మెదక్‌జోన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రూ.2 లక్షల రుణాలను మాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కిసాన్‌మోర్చా జిల్లా ఇన్‌చార్జి వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ సమీపంలో నాయకులు ఒకరోజు దీక్ష చేపట్టారు. సాయంత్రం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా కింద రూ.15 వేలు, కౌలు రైతుకు రూ.12 వేలు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాయిని ప్రసాద్, విజయ్‌కుమార్, బెండ వీణ, కాశినాథ్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల ద్వారా బియ్యం విక్రయం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని బొల్లారంలో గల సివిల్ సప్లై గోదాంలలో పాడైన 2,800 టన్నుల బియ్యాన్ని టెండర్ల ద్వారా విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హరికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2020-21కి సంబంధించి 8 వేల టన్నుల బియ్యం గోదాముల్లో నిల్వ చేసినట్లు తెలిపారు. అందులో నుంచి 5 వేల టన్నులు రేషన్ దుకాణాలకు తరలించామని వివరించారు. కాగా ఇందులో 2,800 టన్నుల బియ్యం పాడైనట్లు చెప్పారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుందని, శాంపిల్స్‌ను నాచారంలోని ల్యాబ్‌కు పంపించామన్నారు. పబ్లిక్ టెండర్ల ద్వారా విక్రయించాలని ఫుడ్ కార్పొరేషన్ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. పౌల్ట్రీ నిర్వాహకులు, డిస్టలరీ వారికి సమాచారం ఇచ్చామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

మెదక్ కలెక్టరేట్: కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు సంతోష్ మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్లను అమలు చేస్తామనడం సరికాదన్నారు.

ఆరోగ్య సర్వే.. సత్వర చికిత్స

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు ■ 'సాక్షి'తో డీఎంహెచ్ఓ శ్రీరాం



మెదక్‌జోన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని డీఎంహెచ్ఓ శ్రీరాం తెలిపారు. సిబ్బంది ఇంటింటి ఆరోగ్య సర్వే చేస్తున్నారని.. వ్యాధులు గుర్తించి ఎప్పటికప్పుడు చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే జిల్లాలో 585 డయేరియా, జ్వర బాధితులు 1,113 మందిని గుర్తించామన్నారు. ప్రతి వారం వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారని వివరించారు. సీజనల్ వ్యాధులపై బుధవారం సాక్షితో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. పలు విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

ఊరూరా మెడికల్ క్యాంపులు

వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో ఇంటింటి ఆరోగ్య సర్వే గత నెల 5వ తేదీ నుంచి కొనసాగుతోంది. క్యాంపుల్లో ఇప్పటివరకు 16,252 మంది జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించాం. వారిలో 1,113 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశాం. అలాగే 585 మందికి డయేరిగా ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించాం. 150 మందికి దగ్గు, జ్వరం, జలుబు ఉండగా మందులు పంపిణీ చేశాం. అంతేకాకుండా జిల్లాలో 417 మందికి మలేరియా అనుమానితులుగా గుర్తించి పరీక్షలు చేయగా నెగెటివ్‌గా నిర్ధారణ అయింది. అలాగే 161 మందికి డెంగీ పరీక్షలు చేయగా వారికి నెగెటివ్‌గా తేలింది.

ప్రతి సోమవారం సమావేశం

ప్రతి సోమవారం ప్రజావాణి ముగియగానే సీజనల్ వ్యాధులపై వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నాం. నాలుగు శాఖల సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఏదైనా గ్రామంలో అపరిశుభ్రంగా ఉంటే వెంటనే పంచాయితీరాజ్ శాఖ వారు అప్రమత్తమవుతున్నారు. పంచాయితీ కార్యదర్శి చొరవ చూపుతున్నారు. పైపులైన్ల ద్వారా వచ్చే నీరు కలుషితం అయినా, ఆ గ్రామంలో జ్వరాల బారిన పడినా వెంటనే ఇతరశాఖల అధికారులు అప్రమత్తమై తగు చర్యలు తీసకుంటున్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

దోమలతో సంక్రమించే మలేరియా, డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు చర్యలు తీసుకుంటున్నాం. గత రెండేళ్లుగా జిల్లాలో మలేరియా లేదు. గతేడాది 34 డెంగీ కేసులు నమోదయ్యాయి. గ్రామాల్లోని గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం, మురుగు కాలువల శుభ్రం చేయడం. చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇళ్లిళ్లు తిరిగి పరిశీలిస్తున్నాం.

ప్రైవేట్‌లో పరీక్షలు వద్దు..

జ్వరం వస్తే ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో రక్త పరీక్షలు చేయించుకోవద్దు. డెంగీ నిర్ధారణ పరికరాలు మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో లేవు. జిల్లా కేంద్ర ఆస్పత్రులోని డయగ్నొస్టిక్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకోవాలి. ఒక వేళ పాజిటివ్‌గా తేలితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

ఒక్కో ఆశావర్కర్ 20 ఇళ్లు..

జిల్లాలో 562 మంది ఆశావర్కర్లు ఉన్నారు. ప్రతి రోజు ఒక్కో ఆశావర్కర్ 20 ఇళ్లను పరిక్షిస్తారు. రోజుకు జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 ఇళ్లను సందర్శిస్తారు. జిల్లాలోని 1.75 లక్షల ఇళ్లను సర్వే చేయాల్సి ఉంటుంది. ఏ గ్రామంలో జ్వరాలు ఉన్నాయో వెంటనే ఏఎన్ఎం ట్యాబ్‌లో నమోదు చేస్తారు. ఆ సమాచారం జిల్లాతో పాటు రాష్ట్ర, కేంద్ర అధికారులకు సైతం వెళ్తోంది. ఏ గ్రామంలో ఎక్కువగా జ్వరాలు ఉంటే అక్కడ వెంటనే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి చికిత్స అందించడంతో పాటు అవసరం అయితే రక్త పరీక్షలు చేస్తున్నాం. అలాగే కేజీబీవీ, మోడల్, రెసిడెన్సియల్ స్కూళ్లను ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు

జిల్లాలో 20 పీహెచ్‌సీలు, 160 సబ్‌సెంటర్లు ఉండగా అన్నింటిలో ఎంబీబీఎస్ వైద్యులు, ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సులు, సబ్ సెంటర్ పరిధిలోని 98లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో నర్సులు, ఆయుష్మాన్, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

రామాయంపేట(మెదక్): హాస్టళ్లలో పరిశుభ్రత పాటించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బందిని ఆదేశించారు. మోడల్ స్కూల్ హాస్టల్‌కు చెందిన విద్యార్థినులు అస్వస్థతకు గురి కాగా బుధవారం వారిని పరామర్శించారు. అనంతరం భోజనంతో పాటు వంట సామగ్రి, రికార్డులు పరిశీలించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ, తహసీల్దార్ కార్యాలయం, హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అంతకుముందు నూతనంగా నిర్మిస్తున్న మెదక్, ఎల్కతుర్తి జాతీయ రహదారిపై రామాయంపేట వద్ద బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలించారు. అలైన్‌మెంట్ మార్చాలని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మెదక్ ఆర్డీఓ రమాదేవితో కలిసి జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. ఆయనతో పాటు తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ రాజు, ఇతర అధికారులు ఉన్నారు.

సీజ్ చేసిన బియ్యం వేలం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్, రేషన్ దుకాణాలు, రైస్‌మిల్లులలో సీజ్ చేసిన 1594.65 క్వింటాళ్ల బియ్యాన్ని వేలం వేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెదక్‌లో 14 క్వింటాళ్లు, పెద్దశంకరంపేటలో 42 క్వింటాళ్లు, రామాయంపేటలో 24.30 క్వింటాళ్లు, చేగుంటలో 6.25 క్వింటాళ్లు, తూప్రాన్‌లో 221.40 క్వింటాళ్లు, పాపన్నపేటలో 3.05 క్వింటాళ్లు, రైస్‌మిల్లులలో 1283.65 క్వింటాళ్ల చొప్పున మొత్తం 1594.65 క్వింటాళ్ల బియ్యం వేలానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో రూ.2,500 ముందస్తుగా డిపాజిట్ చేయాలన్నారు. 24న కలెక్టరేట్‌లో వేలం ఉంటుందని, అత్యధికంగా వేలం పాడిన వారికి బియ్యం అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు పైన పేర్కొన్న ఎంఎల్ఎస్ పాయింట్, రైస్ మిల్లులలో బియ్యాన్ని పరిశీలించుకోవచ్చని సూచించారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ రాధాకిషన్ అన్నారు. బుధవారం మండలంలోని ఉప్పులింగాపూర్ ప్రాథమికోన్నత, వెల్దుర్తి ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉప్పులింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రార్థనా సమయానికి విద్యార్థులు తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇంటికి వెళ్లి సకాలంలో పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కేజీబీవీ పాఠశాలలో రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై ఎంఆర్సీ కార్యాలయంలో సమీక్ష జరిపారు. జిల్లావ్యాప్తంగా 90 శాతం వరకు పనులు పూర్తికాగా 75 శాతం పనులకు సంబంధించి నిధులు మంజూరయ్యాయన్నారు. మిగితా పనులను ఐదు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. అలాగే గతేడాది పదో తరగతి వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కట్ల సత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు. డీఈఓ చేతులమీదుగా వారికి ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే నేషనల్ గ్రీన్ కోర్స్ (ఎన్‌జీసీ)లో భాగంగా జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



వెల్దుర్తి: విద్యార్థినిని సన్మానిస్తున్న డీఈఓ రాధాకిషన్

యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా

అధికారుల సర్వే అడ్డగింత

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన సంఘటన మండలంలోని కాగజ్ మద్దూర్ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మ తండా సమీపంలో జరిగింది. హైదరాబాద్‌కు చెందిన రియల్ వ్యాపారి పరకాల ప్రభాకర్‌గౌడ్ గతంలో పెద్దమ్మ తండా సమీపంలో 22 ఎకరాల 30 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిని ఆనుకొని ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు ఖరీజ్ ఖాతాలో ఉన్న మరో మూడెకరాల భూమిని కబ్జా చేసి చుట్టూ ఫెన్సింగ్ వేశాడు. ఈ విషయమై పలుమార్లు గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఇటీవల ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం రెవెన్యూ అధికారులు ఆ భూమిని సర్వే చేసేందుకు వెళ్లగా ప్రభాకర్‌గౌడ్ అడ్డుకున్నాడు. ఈవిషయమై తహసీల్దార్ కమలాద్రిని వివరణ కోరగా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి తదుపరి ఆదేశాలకు అనుగుణంగా సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడుతామని తెలిపారు. తండావాసులు మాట్లాడుతూ.. ప్రభాకర్‌గౌడ్ కబ్జా చేసిన సర్వే నంబర్ 139/2లో ఓ పాత భవనం ఉండేదని.. గతంలో అందులో ప్రభుత్వ పాఠశాల కొనసాగేదన్నారు. అప్పట్లో మోహన్‌రెడ్డి అనే వ్యక్తి ఆ భవనాన్ని పాఠశాల కోసం గ్రామ పంచాయతీకి అప్పగించారని చెప్పారు. దానికి సంబంధించిన సాక్ష్యాలు సైతం తమ వద్ద ఉన్నాయన్నారు. ప్రస్తుతం పాఠశాల లేకపోవడంతో పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులు



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి ఇదే..

మా శవాలపై ట్రిపుల్‌ఆర్ నిర్మించండి



ప్రజ్ఞాపూర్ వద్ద రాజీవ్‌రహదారిపై రాస్తారోకో చేస్తున్న భూ బాధితులు


- ఎవరి ప్రయోజనాల కోసం ఈ రోడ్డు
- అలైన్‌మెంట్ మార్చకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం
- మోకాళ్లపై కూర్చొని భూ బాధితుల నిరసన
- రాజీవ్‌రహదారిపై రాస్తారోకో, ధర్నా

గజ్వేల్: 'మా తాతముత్తాతల నుంచి వచ్చిన కొద్దిపాటి భూమితో వ్యవసాయం చేసుకొని బతుకుతుంటే.. రిజర్వాయర్ల కాల్వల కోసం కొంత తీసుకున్నారు...ఇప్పుడు ట్రిపుల్‌ఆర్ పేరుతో మొత్తం తీసుకోవాలని చూస్తుండ్రు.. ఎవరి కోసం ట్రిపుల్‌ఆర్? రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం మమ్మల్ని బలి చేస్తారా? అలైన్‌మెంట్ మార్చండి.. లేదా మా శవాలమీద ట్రిపుల్‌ఆర్ కట్టండి' అంటూ ట్రిపుల్ భూ బాధితులు ఆక్రోశం వెల్లగక్కారు. బుధవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ వద్ద రాజీవ్‌రహదారిపై మోకాళ్లపై కూర్చొని రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ట్రిపుల్‌ఆర్ రోడ్డును విస్తరించనున్న గజ్వేల్ నియోజకవర్గంలోని పీర్లపల్లి, చేబర్తి, నర్సన్నపేట, ఎర్రవల్లితోపాటు రాయపోల్ మండలం ఎల్కల్ తదితర గ్రామాలకు చెందిన భూబాధితులు ప్రజ్ఞాపూర్ చౌరస్తాకు చేరుకొని రాజీవ్‌రహదారిపై బైఠాయించారు.

ఇష్టారాజ్యంగా లాక్కొంటున్నారు..

ట్రిపుల్‌ఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల పేరిట రైతుల భూములను ఇష్టారాజ్యంగా లాక్కొంటున్నారని అన్నారు. ట్రిపుల్‌ఆర్ భూసేకరణ పేరిట తీవ్ర క్షోభకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 9న రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరామని, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను పట్టించుకోకుండా ముందుకు వెళ్లాలనుకుంటే తమ శవాలపై ట్రిపుల్ ఆర్ నిర్మించాలన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకో సమాచారం తెలుసుకున్న గజ్వేల్ సీఐ సైదా సంఘటనా స్థలానికి చేరుకొని భూబాధితులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం



సంగారెడ్డి టౌన్ : తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గ్రూప్ 1 మెయిన్స్‌కు శిక్షణ ఇవ్వనున్నామని ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ www. tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 10 నుంచి 19 లోపు మాత్రమే సమయం ఉందని పేర్కొన్నారు. 75 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆ సమయంలో స్టైఫెండ్ నెలకు రూ. 5వేలు వస్తుందని తెలిపారు. వివరాలకు 99495-92991 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

జహీరాబాద్ మీదుగా ప్రత్యేక రైలు

16న అకోలా నుంచి పండరిపూర్ వరకు నడపనున్న రైల్వేశాఖ

జహీరాబాద్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 16న రైల్వే శాఖ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు జహీరాబాద్ స్టేషన్ మాస్టర్ మాధవక్రిష్ణ తెలిపారు. ఈనెల 17న పండరిపూర్‌లోని పాండురంగ దేవాలయంలో ప్రత్యేక ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో అకోలా నుంచి జహీరాబాద్ మీదుగా పండరిపూర్‌కు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం 16న ఉదయం 11 గంటలకు అకోలా నుంచి ప్రత్యేక రైలు బయలు దేరుతోందని, జహీరాబాద్‌కు రాత్రి 10.37 గంటలకు చేరుకుంటుందన్నారు. ఇక్కడి నుంచి బయలుదేరి పండరిపూర్‌కు మరుసటి రోజు ఉదయం 9 గంటలకు చేరుకుంటుందని వివరించారు. 17న రాత్రికి 9.40 గంటలకు తిరుగు ప్రయాణం అవుతుందని, జహీరాబాద్‌కు 18న ఉదయం 6.40 గంటలకు చేరుకుంటుందన్నారు. అకోలా నుంచి బయలుదేరి పూర్ణ జంక్షన్, పర్భనీ, పర్లివైజ్యనాథ్, లాతూర్ రోడ్డు, ఉద్గీర్, బాల్కి, బీదర్, జహీరాబాద్, వికారాబాద్, తాండూర్, చిట్టా పూర్, వాడి, కల్‌బుర్గి, సోలాపూర్‌ల మీదుగా పండరిపూర్‌కు చేరుకుంటుందన్నారు. ప్రత్యేక రైలును నడపడం వల్ల కర్ణాటకలోని బీదర్, బాల్కిలతో పాటు జహీరాబాద్ ప్రాంత ప్రయాణికులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని తెలిపారు. రిజర్వేషన్ బోగీలతో పాటు జనరల్ బోగిలలో భక్తులు ప్రయాణించవచ్చన్నారు.



జహీరాబాద్ రైల్వే స్టేషన్

ప్రజలకు మరింత సేవలు

- ప్రతి నియోజకవర్గంలో కార్యాలయం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు)/సదాశివపేట (సంగారెడ్డి): మెదక్ లోక్‌సభ పరిధిలోని ప్రతి శాసన సభ నియోజకవర్గంలో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు క్షేత్రస్థాయిలో మరింత సేవలను అందిస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. బుధవారం బీజేపీ భారతినగర్, రామచంద్రాపురం డివిజన్, పట్టణ శాఖలు, సదాశివపేట ఎన్‌గార్డెన్ నిర్వహించిన ఓటర్ల కృతజ్ఞత సభల్లో ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. మెదక్ లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఆగస్టు 15 లోపు తన కార్యాలయాలను ప్రారంభిస్తానన్నారు. సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చిన కార్యాలయంలోని వారికి తెలియజేయాలని సూచించారు. ఎంపీగా గెలిచిన వెంటనే స్థానిక నాయకులతో కలిసి మెట్రో రైలు సీఎండీను కలిశానన్నారు. మొదటి ఫేజ్‌లో మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు, రెండో ఫేజ్‌లో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రోరైలు పొడిగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం ప్రజలు లక్షకు పైగా ఓట్లు వేశారని అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచు స్థానాలను కేవసం చేసుకుందామని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, నాయకులు అంజనేయులు, అదేళ్ల రవీందర్, నేతలు పాల్గొన్నారు.



ఎంపీ రఘునందన్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నేతలు

క్లుప్తంగా

రైసు మిల్లుల్లో తనిఖీలు



తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు

రామాయంపేట(మెదక్): విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారం సాయంత్రం రామాయంపేట పట్టణంలోని పలు రైస్‌మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ రైస్‌కు సంబంధించి వివరాలు సేకరించారు. ఒక్కో రైసుమిల్లు ఎంత సీఎంఆర్ ఇవ్వాలి, ఎంత ఇచ్చారనే విషయమై ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. అధికారులు శ్రీనివాస్, నాగేంద్ర రైసు మిల్లుల్లో ఈ తనిఖీలు చేపట్టారు. వారి వెంట తహసీల్దార్ రజనీకుమారి, ఆర్‌ఐ రాజు ఉన్నారు.

బస్సులో రూ.5 లక్షలు చోరీ

తూప్రాన్: బస్సులో ప్రయాణికుడి బ్యాగు నుంచి నగదు చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. మేడ్చల్ జిల్లా కొంపల్లి పట్టణానికి చెందిన అమీన్ అబ్దుల్ లాలని అనే వ్యక్తి మసాల వ్యాపారం చేస్తున్నాడు. నిజామాబాద్‌కు చెందిన ఇమ్రాన్ వద్ద రూ.5 లక్షలు రావాల్సి ఉండటంతో తీసుకొస్తున్నాడు. ఈ నెల 9న మంగళవారం నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు రాజధాని ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. మార్గమధ్యలో తూప్రాన్ దాబా వద్ద రాత్రి 9 గంటల ప్రాంతంలో బస్సును భోజనానికి నిలిపారు. అబ్దుల్ తన వద్ద ఉన్న రూ.5 లక్షలు కలిగిన బ్యాగును అక్కడే పెట్టి భోజనానికి వెళ్లాడు. తిరిగి బస్సులో ఎక్కి చూడగా బ్యాగు కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 119 మందిపై కేసు



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్లు అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. సీపీ ఆదేశానుసారం కమిషనరేట్ పరిధిలో మంగళవారం రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు పోలీసు సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టారన్నారు. 119 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ ఉమేశ్, ఆయా పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా స్వాధీనం



గుట్కా ప్యాకెట్లతో పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో లక్ష్మీనారాయణ నిర్వహిస్తున్న వినాయక కిరాణ షాపులో ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉంచినట్లు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ సీఐ ఉపేందర్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి షాపులో తనిఖీలు నిర్వహించారు. షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 61,108 విలువగల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇట్లయితే.. సదువులెట్ల?

సమస్యల ఒడిలో సర్కారు బడులు | వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- పదుల్లో విద్యార్థులు.. ఒక్కొక్కరే గురువు
- మూత బడుతున్న పాఠశాలలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులు కనబడటం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో విద్యార్థులు చదువుల్లో రాణించలేకపోతున్నారు. చాలా చోట్ల పదుల్లో విద్యార్థులు ఉంటే ఒకరిద్దరే ఉపాధ్యాయులు ఉండి పాఠశాలలను నెట్టుకొస్తున్నారు. మరికొన్ని చోట్ల అయితే పరిస్థితి మరీ దారుణం. ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు ఉండరు.. విద్యార్థులు ఉంటే ఉపాధ్యాయులు ఉండరు. దీంతో ఏకంగా పాఠశాలలకు తాళాలు వేశారు. పాఠశాలల్లోని ప్రస్తుత పరిస్థితిపై సాక్షి ప్రత్యేక కథనం..



అక్కన్నపేట మండల కేంద్రంలోని చౌడుతండాలో మూతపడిన ప్రాథమిక పాఠశాల

80 మందికి ముగ్గురే



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

రేగోడ్(మెదక్): మండలంలోని ఆర్.ఇటిక్యాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. 80 మంది విద్యార్థులకు ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్య కుంటుపడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకే ఒక్కరు

హుస్నాబాద్: హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 46 మంది విద్యార్థుకు గాను ఒక్కరే టీచర్ బోధిస్తున్నారు. గతంలో నలుగురు టీచర్లు ఉండేవారు. ఇటీవలె ముగ్గురు ఉపాధ్యాయులు కోటిచింతల రవీందర్, రాజమౌళి, సిద్దిరాములు ఉద్యోగ విరమణ చేశారు. దీంతో మూడు టీచర్ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలో ఈ మూడు పోస్టులకు ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు ఆప్షన్ పెట్టుకున్నారు. వీరు పని చేస్తున్న పాఠశాలకు రీలివర్‌గా ఉపాధ్యాయులు ఎవరూ రాకపోవడంతో వారు అక్కడే ఉండిపోయారు. ఉన్న ఒక్క టీచర్ శ్రీ లలిత 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బోధిస్తున్నారు. దీంతో స్థానిక విద్యాధికారులు పొట్లపల్లి పాఠశాలకు చెందిన ఓ టీచర్‌ను ఈ నెల 8వ తేదీన మహ్మదాపూర్ పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తున్న టీచర్లు

మూడు బడులు మూత

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని చౌడుతండా, కేశనాయక్‌తండా, పంతుల్‌తండా గ్రామ పరిధిలోని ఫకీర్‌తండా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలలకు తాళాలు వేశారు. ఇక్కడ పని చేస్తున్న పలువురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపించారు. గతేడాది చౌడుతండా ప్రాథమిక పాఠశాలలో 10 నుంచి 15 మంది, కేశనాయక్ తండాలో ఐదుగురు, ఫకీర్‌తండా ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులు ఉండేవారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమై సుమారుగా నెలరోజులు దాటుతున్న విద్యార్థు రాకపోవడంతో పాఠశాలలను మూసివేసినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. అలాగే రేగొండ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కూడా విద్యార్థులు ఎవరు రావడం లేదని త్వరలో ఆ పాఠశాల కూడా మూసివేసే అవకాశం ఉందని చెప్పారు.

అంతా చెట్ల కిందే..



చెట్ల కింద కూర్చొబెట్టి చదివిపిస్తున్న ఉపాధ్యాయులు

అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామ ప్రభుత్వ పాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వెక్కిరిస్తోంది. దాదాపు 95 మందికిపైగా విద్యార్థులు ఉండగా కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. నిబంధనల ప్రకారం ఐదురుగు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉండటంతో విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. ప్రస్తుతం అందరినీ ఒకే చోట కూర్చోబెట్టి చదువుపిస్తున్నామని అంటున్నారు.

> **ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లాం**
>
> 
>
> పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, ఉపాధ్యాయులను కేటాయించాలని చెప్పాం. ప్రస్తుతం నాతో పాటు మరో ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో అటెండర్, స్కావెంజర్ లేక ఇబ్బందిగా ఉంది. విద్యార్థులందరినీ ఒకే చోట కూర్చోబెట్టి చదివిపిస్తున్నాం. ఉపాధ్యాయులను కేటాయించకపోతే తరగతుల నిర్వహణ కష్టంగా ఉంటుంది.
>
> – మధుసూదన్‌చారి, ప్రధానోపాధ్యాయులు, అంతక్కపేట

ఏడు తరగతులు ఒక్కరే టీచర్



తరగతులు బోధిస్తున్న ఒకే టీచర్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని పస్తాపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఉంది. ఏడు తరగతులకు 50 మంది విద్యార్థులు ఉండగా రెండు టీచర్ పోస్టులు ఉన్నాయి. పస్తాపూర్ పాఠశాలలో ఉన్న ఇద్దరిలో ఒకరు హుగ్గెల్లి పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం పాఠశాలలో ఒక్కరే టీచర్ ఉన్నారు. ఉపాధ్యాయులు లేక పిల్లల చదువులు సాగడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఏడు తరగతుల పిల్లలను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధించడానికి టీచర్‌కు కూడా కష్టమవుతుంది.

ఉన్న నలుగురూ తలా ఓ దిక్కు



మూతపడ్డ అంబాజీతండా పాఠశాల

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంబాజీతండా పాఠశాల విద్యార్థులు లేక మూతపడింది. అంబాజీ తండాలో 1 నుంచి 5వ తరగతి వరకు పాఠశాల ఉంది. 2023–24 విద్యా సంవత్సరం నలుగురు విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయురాలు కీర్తి విధులు నిర్వహించింది. ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలో ఇద్దరు విద్యార్థులు 5వ తరగతి పూర్తి కావడంతో ఇతర గ్రామాలకు వెళ్లారు. ఒకరు గురుకుల పాఠశాలకు వెళ్లగా మరొకరు ప్రయివేటు పాఠశాలకు వెళ్తున్నారు. దీంతో తండాలో పాఠశాలకు వచ్చే విద్యార్థులు లేక మూత పడింది. ఉపాధ్యాయురాలిని పక్క గ్రామం సదాశివపల్లికి డిప్యూటేషన్‌పై పంపించారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయుల బదిలీల్లో మరొకరు ఇక్కడి వస్తున్నారు.

ఐదు తరగతులు.. నలుగురు విద్యార్థులు



ట్యాబ్ ద్వారా పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు

చిన్నశంకరంపేట(మెదక్): నలుగురు విద్యార్థులు ఒక టీచర్.. వీరంతా ఒకటవ తరగతి విద్యార్థులే ఇది చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కుర్మపల్లి ప్రాథమిక పాఠశాల పరిస్థితి. ఇందులో ఐదు తరగతులకు నలుగురే విద్యార్థులున్నారు. ఆ నలుగురు కూడా ఒకటో తరగతి విద్యార్థులే కాగా 2 నుంచి 5వ తరగతిలో ఎవరూ చదవడంలేదు. ఉపాధ్యాయుడు సలీమొద్దీన్ నలుగురు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేస్తున్నాడు. మిగితా విద్యార్థులు దగ్గరలోని పాఠశాలల్లో చేరారని ఉపాధ్యాయుడు తెలిపారు.

గురువులేని విద్య



ఉపాధ్యాయుడు లేకుండానే తరగతిలో కూర్చున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో 26 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, 8 పాఠశాలల్లో 5 తరగతులకు కేవలం ఒకే ఒక ఉపాధ్యాయుడితో బోధన జరుగుతుంది. మరో రెండు పాఠశాలలు గురువు లేకుండానే నడుస్తున్నాయి. రాందాస్‌గూడ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుడు భూషణం రిటైర్డ్ కాగా, ఫైజాబాద్ తండా పాఠశాల ఉపాధ్యాయుడు రెండేళ్ల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి పాఠశాలకు రెగ్యూలర్ టీచర్ లేడు. 9 మంది విద్యార్థులు ఉన్న ఆ పాఠశాలకు ప్రస్తుతం గురువే లేడు. మండలంలో విద్యావ్యవస్థ దీనస్థితలో ఉందని, తమ పిల్లల భవిష్యత్‌కు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందని తల్లితండ్రులు అంటున్నారు.



సిద్దిపేట కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఏఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

- సిద్దిపేటలో న్యాయవాదుల నిరసన
- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- విధులకు ఆటంకం కలిగించాడంటూ కేసు వేసిన ఏఎస్‌ఐ

సిద్దిపేటకమాన్: న్యాయవాదిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేటలో బుధవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. స్థానిక కోర్టు నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీగా వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ సీఐ లక్ష్మీబాబుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ.. ఓ కేసు విషయంలో తన క్లయింట్ బెయిల్ విషయమై వెళ్లిన జూనియర్ న్యాయవాది రవికుమార్‌పై టూటౌన్ ఏఎస్‌ఐ ఉమారెడ్డి అమర్యాదగా ప్రవర్తించి దాడి చేశాడని ఆరోపించారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి దాడి చేసిన ఏఎస్‌ఐని సస్పెండ్ చేసి అతడిపై కేసు నమోదు చేయాలని వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనికి నిరసనగా నేడు, రేపు రెండు రోజులు కోర్టు విధులకు హాజరుకాకుండా నిరసన తెలుపనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఓ కేసులో నిందితుడికి వైద్య పరీక్షల నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడికి న్యాయవాది రవికుమార్ వచ్చి దురుసుగా ప్రవర్తించాడని, తన విధులకు ఆటంకం కలిగించాడని ఏఎస్‌ఐ ఉమారెడ్డి సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. న్యాయవాది రవికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపారు. అదే విధంగా న్యాయవాదులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నట్లు వన్ టౌన్ సీఐ తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారయణ, న్యాయవాదులు శివాజీ, సాయిబాబ, రాజేశ్, రమేశ్, రవిబాబు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో గేదె మృతి

రామాయంపేట(మెదక్): చిరుత దాడిలో గేదె మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఝాన్సిలింగాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప రాజు వ్యవసాయ పంట చేను వద్ద మంగళవారం రాత్రి పశువులను కట్టేశాడు. ఉదయం వెళ్లి చూసే సరికి చిరుత దాడిలో గేదె చనిపోయి కనిపించింది. రాజు విషయాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు ఘటనా స్థలిని సందర్శించారు. కొంత కాలంగా చిరుత ఈ ప్రాంతంలోనే తిరుగుతుందని, తాము పలుమార్లు అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామ రైతులు వాపోయారు.

వైద్య సిబ్బంది అరెస్ట్



నిందితులను చూపుతున్న పోలీసులు

హుస్నాబాద్‌రూరల్: మహిళ అనుమతి లేకుండా అబార్షన్ చేసిన హుస్నాబాద్ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యంను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సుమేర బేగం కొన్ని నెలల కిందట హుస్నాబాద్‌కు చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంది. అమ్మాయి తల్లిదండ్రులు ఆమెకు మాయమాటలు చెప్పి హుజురాబాద్‌లోని మాధవి నర్సింగ్ హోంలో అబార్షన్ చేయించారు. అప్పుడే సుమేరబేగం హుస్నాబాద్‌లోని భర్త వద్దకు వెళ్లి తల్లిదండ్రులపై ఫిర్యాదు చేయగా వారిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. అబార్షన్ చేసిన ఆస్పత్రిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా యాజమాన్యం పాపిరెడ్డి, సత్యనారాయణ, రజితను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పెర్కొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ ప్రక్రియను చేపట్టాలని బీజేపి జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ బుధవారం బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట రైతు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీ చేపట్టాలన్నారు. సాగు చేస్తున్న ప్రతీ రైతుకు రైతు భరోసా కింద రూ.15 వేలు అందించాలన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఏడాదికి ఇవ్వాలన్నారు. ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని లేని పక్షంలో ఆగస్టు నెల తర్వాత పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బాలేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని ముదిరాజ్ మహాసభ సిద్దిపేట జిల్లా కార్యదర్శి తుమ్మల బాల్‌రాజు కోరారు. బుధవారం మిరుదొడ్డిలో ముదిరాజ్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రాధాన్యాత ఇవ్వాలన్నారు. రాష్ట్ర ముదిరాజ్ మహా సభ పిలుపు మేరకు ఈ నెల 15 నుంచి 20 వరకు రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో వినతిపత్రాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల మహాసభ అధ్యక్షుడు ఐల విద్యాసాగర్, సంఘం నాయకులు మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, నర్సింహులు, ప్రశాంత్, ఎల్లం, కోటి తదితరులు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం
- జగదేవ్‌పూర్ మండలంలో ఘటన
- అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలు




శేఖర్ (ఫైల్)



సౌమ్య (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆరేళ్లుగా కలిసున్నారు.. ఏడాది నుంచి కుటుంబ కలహాలతో విడిపోదామనుకున్నారు.. ఇంతలోనే పురుగుల మందు తాగి దంపతులు ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన అకారం నర్సింలు, లక్ష్మీ దంపతుల కూతురు సౌమ్య(25)ను ఆరేళ్ల కిందట ఇటిక్యాల గ్రామానికి చెందిన కర్కపట్ల శేఖర్(36)కు ఇచ్చి వివాహం చేశారు. శేఖర్, సౌమ్య గ్రామంలోనే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎనిమిది నెలల కిందట నుంచి మేడ్చల్ జిల్లా తుర్కపల్లిలో మామిడి తోటలో శేఖర్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఐదేళ్లలోపు శివాన్స్, బిట్టు పిల్లలు ఉన్నారు. ఐదేళ్లపాటు దంపతులిద్దరూ బాగానే ఉన్నప్పటికీ ఏడాది నుంచి కుటుంబంలో ఇద్దరి మధ్య కలహాలు ప్రారంభమయ్యాయి. తరచూ గొడవలు జరుగుతుండటంతో సౌమ్య తల్లిదండ్రులు, పంచాయతీ పెద్దలు నచ్చజెప్పారు. అయినప్పటికీ ఇద్దరిలో మార్పు రాకపోవడంతో చివరికి విడాకుల వరకు వచ్చింది. ఏడాది నుంచి సౌమ్య అమ్మగారింటి వద్దే ఉంటుంది. రెండు నెలల కిందట సౌమ్య తల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. పదిహేను రోజుల కిందట శేఖర్ దౌలాపూర్‌కు వచ్చి భార్య సౌమ్యను తీసుకొని తుర్కపల్లికి వెళ్లాడు. మంగళవారం రాత్రి తుర్కపల్లి నుంచి ఇద్దరు బైక్‌పై ఇటిక్యాల గ్రామంలో తమ వ్యవసాయ పొలం వద్దకు వచ్చి పురుగుల మందు తాగారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అపస్మారకస్థితిలో ఉన్న దంపతులను 108 ద్వారా గజ్వేల్ ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సౌమ్య మృతి చెందింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం శేఖర్ మృతి చెందాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రమేశ్ (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన 161వ జాతీయ ప్రధాన రహదారి కోళపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అల్లాదుర్గం మండలం అప్పాజిపల్లి తండాకు చెందిన వడితే రమేశ్ (28) బైక్‌పై పెద్దశంకరంపేట వైపు వస్తుండగా, హైదరాబాద్ వైపు నుంచి నిజాంపేట వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్‌ఐ విఠల్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ బాడీ బిల్డర్..



సోహెల్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరాములు తెలిపిన కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన అబిదా బేగం సలీం దంపతుల కుమారుడు ఎండీ. సోహెల్ (23) బాడీ బిల్డర్‌గా, క్రికెట్ క్రీడాకారుడిగా రాణిస్తున్నాడు. మండల పరిధిలోని మల్లుపల్లిలో గత నెల 29న నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి స్నేహితుడు ఖదీర్‌తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. ధర్మారం ఆరెపల్లి శివారు మలుపు వద్ద బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోహెల్, ఖదీర్ ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సోహెల్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి పెద్దమ్మ కుమారుడు జుల్‌ఫాకర్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కొంగల వేటకు వెళ్లి.. చెరువులో మునిగి యువకుడి మృతి



లక్ష్మయ్య మృతదేహం

చేగుంట(తూప్రాన్): కాలుజారి నీటిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన రెడ్డిపల్లి కాలనీలో బుధవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు.. నెల్లూరు జిల్లా కావలి మండలం మన్నంగి దిన్నె గ్రామానికి చెందిన పోలూరి లక్ష్మయ్య(19) రెడ్డిపల్లి కాలనీలో ఉంటున్న తన అక్క శేషమ్మ వద్దకు 20 రోజుల కిందట వచ్చాడు. మంగళవారం కొంగల వేట కోసం వెళ్లిన లక్ష్మయ్య ప్రమాదవశాత్తు కాలుజారి బతుకమ్మ చెరువులో పడి మృతి చెందాడు. చెరువులో మృతి చెందిన లక్ష్మయ్యను గుర్తించి కాలనీవాసులు బుధవారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.